క్లుప్తంగా

రైతు అవగాహన సదస్సు

మంచాల: మండల కేంద్రంలోని రైతు వేదిక భవనంలో మంగళవారం పంటల సాగుపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రైతులకు అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు మంచాల మండల వ్యవసాయాధికారి జ్యోతి శ్రీ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. వ్యవసాయ శాఖ శాస్త్రవేత్తలతో ఉదయం 9:00 గంటల నుంచి 10:30 ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు.రైతులు అధిక సంఖ్యలో పాల్గొని సదస్సును జయప్రదం చేయాలన్నారు.

రైతులకు రసీదులు ఇవ్వాలి

మండల వ్యవసాయాధికారి అరుణకుమారి



ఫర్టిలైజర్ షాపులో రిజిస్టర్‌ను పరిశీలిస్తున్న ఏఓ అరుణకుమారి

ఆమనగల్లు: విత్తనాలు, ఎరువుల కొనుగోలుకు సంబంధించి రైతులకు తప్పనిసరిగా రసీదులు ఇవ్వాలని ఆమనగల్లు మండల వ్యవసాయాధికారి అరుణకుమారి సూచించారు. పట్టణంలోని పలు అధీకృత విత్తన డీలర్ల షాపులను సోమవారం ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విత్తన, ఎరువుల నిలువలు వాటికి సంబంధించిన ఇన్‌వాయిస్‌లు, బిల్లులు, ధరల పట్టిక బోర్డులను ఆమె పరిశీలించారు. నకిలీ విత్తనాలు, ఎరువులు విక్రయించినా, అధిక ధరలకు అమ్మినా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో డీలర్లు జంగయ్య, చంద్రశేఖర్, రవి, సురేష్, వెంకటయ్య, రాజు తదితరులు పాల్గొన్నారు.

రాజముద్ర చిహ్నంలో అంబేడ్కర్ ఫొటో పెట్టండి

ధర్మసమాజ్ పార్టీ మండల కన్వీనర్ ప్రదీప్



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

మంచాల: తెలంగాణ ప్రభుత్వం రాష్ట్ర రాజముద్ర చిహ్నం మారుస్తామనదాన్ని తాము సమర్థిస్తున్నామని ధర్మసమాజ్ పార్టీ మండల కన్వీనర్ ప్రదీప్ అన్నారు. ఈ మేరకు ఆయన సోమవారం మంచాల తహసీల్దార్ వెంకటప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. కొత్త చిహ్నంలో భారత రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేడ్కర్‌తో పాటు ఉస్మానియా యూనివర్సిటీ, పండుగ సాయన్న, సర్దార్ పాపన్న, సమ్మక్కసారక్క చిత్రాలను ఏర్పాటు చేసి తెలంగాణ చరిత్రకు మరింత ఔన్నత్యం తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆసంఘం నాయకులు రంజిత్ మహరాజ్, లింగస్వామి, వంశీ, శివలింగం తదితరులు పాల్గొన్నారు.

చరికొండకు బస్సు సర్వీసులు నడపండి

మంత్రి పొన్నంకు గ్రామస్తుల వినతి

కడ్తాల్: మండల పరిధిలోని చరికొండ గ్రామం మీదుగా వివిధ గ్రామాలకు కల్వకుర్తి ఆర్టీసీ డిపో నుంచి బస్సు సౌకర్యం కల్పించాలని రాష్ట్ర రవాణా మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్‌ను హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో సోమవారం చరికొండ గ్రామస్తులు కలిసి వినతిపత్రం అందించారు. ఈ ప్రాంతంలో సకాలంలో బస్సు సౌకర్యం లేక విద్యార్థులు, రైతులు, కూలీలు, మహిళలు అనేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. వెంటనే కల్వకుర్తి ఆర్టీసీ డిపో నుంచి అదనంగా రెండు బస్సులను చరికొండ మీదుగా రాకపోకలు సాగించే విధంగా ఏర్పాటు చేయాలని కోరారు. కల్వకుర్తి–ఆమనగల్లు, కర్కల్‌పహాడ్, ఎక్వాయిపల్లి, ముద్విన్, చరికొండ, పల్లెచెలక, మేడిపల్లి, యాచారం వరకు నడపాలని, మరోబస్సును మాల్ నుంచి కొల్కుల్‌పల్లి, నాగిళ్ల, చరికొండ, ఆకుతోటపల్లి, ఆమనగల్లు, కల్వకుర్తి వరకు ఏర్పాటు చేయాలని వినతి పత్రంలో కోరారు. మంత్రి సానుకూలంగా స్పందించారని వారు తెలిపారు. త్వరలో ఆర్టీసీ అధికారులతో మాట్లాడి సాధ్యాసాధ్యాలను పరిశీలిస్తామన్నారు. ఈ కార్యక్ర మంలో చరికొండ ఎంపీటీసీ రాములుగౌడ్, వేణుగోపాల్‌గౌడ్, రాజీవ్, మహేందర్‌గౌడ్, హరిచందర్, మహేశ్, యాదయ్య తదితరులు ఉన్నారు.

రైతుబజార్లలో కూరగాయల ధరలు

దిల్‌సుఖ్‌నగర్: సరూర్‌నగర్,వనస్థలిపురం రైతుబజార్‌లలో కూరగాయల ధరలు (కిలో...రూపాయల్లో) టమోటా లోకల్ 45, వంకాయ 23, బెండ 50, పచ్చిమిర్చి 60, కాకర 45, బీర 55, క్యాలీఫ్లవర్28, క్యాబేజీ 23, క్యారెట్ 40. దొండ 18, ఆలు 33, ఉల్లి 34, గోకర 45, దోస 28, సొర 11, పొట్ల 18, అరటి 11, చిక్కుడు 65, అర్వి 40, మునగ 55, చిలగడదుంప 55, బీట్‌రూట్ 25, కీర 25, ఫ్రెంచ్ బీన్స్ 85, కాప్సికమ్ 65. గమనిక: ఈధరలు మంగళవారం 9 గంటల వరకు మాత్రమే ఈ ధరలు అమలులో ఉంటాయి.

అభివృద్ధి పనులు పూర్తయ్యేనా?

- ప్రభుత్వ బడుల్లో వసతుల కల్పనలో తీవ్ర జాప్యం
- నిధులు, ఉపాధ్యాయుల కొరతతో ఇక్కట్లు
- ఇబ్బందులు పడుతున్న విద్యార్థులు



కడ్తాల్‌లోని ఓ పాఠశాలలో అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న అధికారులు

కడ్తాల్: మండల పరిధిలోని పలు ప్రభుత్వ పాఠశాలల్లో సమస్యలు తిష్ట వేశాయి. గత ప్రభుత్వం మన ఊరు– మన బడి పథకంలో భాగంగా మండలంలో 16 పాఠశాలలు ఎంపిక చేసింది. వాటిలో మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాల, బాలిక ఉన్నత పాఠశాల, బాలుర ప్రాథమికోన్నత పాఠశాల, బాలికల ప్రాథమికోన్నత పాఠశాల, రావిచేడ్‌లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాల, పద్మావతి కాలనీ ప్రాథమిక పాఠశాల, మక్తమాదారం ప్రాథమికోన్నత పాఠశాల, అన్మాస్‌పల్లి గ్రామంలోని ప్రాథమిక పాఠశాల, జమ్ములాబావి తండా ప్రాథమిక పాఠశాల, రేఖ్యతండాలో ప్రాథమిక పాఠశాల, న్యామతాపూర్ పీఎస్, పల్లెచెలక పీఎస్, మైసిగండి డీఎన్‌టీ పాఠశాల, ఎక్వాయిపల్లి, ముద్విన్ తదితర పాఠశాలలను అప్పట్లో ఎంపిక చేశారు. వాటిలో కడ్తాల్‌లోని బాలికల ప్రాథమికోన్నత, బాలుర ప్రాథమికోన్నత పాఠశాల, సాలార్‌పూర్ ప్రాథమిక పాఠశాల, ముద్విన్ ప్రాథమిక పాఠశాలలో పూర్తి స్థాయిలో మౌలిక వసతులు కల్పించారు.

నిధులు విడుదల కాకపోవడంతో..

కడ్తాల్‌లోని బాలుర ఉన్నత పాఠశాల, బాలికల ఉన్నత పాఠశాల, రావిచేడ్ ఉన్నత పాఠశాల, రావిచేడ్ ప్రాథమిక పాఠశాల, మక్తమాదారం ప్రాథమికోన్నత పాఠశాల, అన్మాస్‌పల్లి గ్రామంలోని ప్రాథమిక పాఠశాల, జమ్ములాబావి తండా ప్రాథమిక పాఠశాల, రేఖ్యతండాలోని ప్రాథమిక పాఠశాల, న్యామతాపూర్ ప్రాథమిక పాఠశాల, మైసిగండి డీఎన్‌టీ పాఠశాల, ఎక్వాయిపల్లి పాఠశాలల్లో పనులు కొంత మేరకు జరిగాయి. 60 శాతం మేరకు నిధులు విడుదలై మిగతావి విడుదల కాకపోవడంతో పనులు అసంపూర్తిగా నిలిచిపోయాయి. పల్లెచెలక, రావిచేడ్ పద్మావతి కాలనీ పాఠశాలల్లో అసలు పనులే ప్రారంభం కాలేదు.

కొనసాగుతున్న పనులు

రాష్ట్రంలో ఇటీవల అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం పాఠశాలలో మౌలిక వసతుల కల్పనకు అమ్మ ఆదర్శ పాఠశాలల పథకం కింద మండలంలో 12 పాఠశాలలను ఎంపిక చేసింది. అన్మాస్‌పల్లి, వంపుగూడ, గడ్డమీదితండా, రేకులకుంట, గోవిందాయిపల్లి, పెద్దవేములోని బావితండా ప్రాథమిక పాఠశాలలు, కర్కల్‌పహాడ్, చల్లంపల్లి, వాస్‌దేవ్‌పూర్ ప్రాథమికోన్నత పాఠశాలలు, ఎక్వాయిపల్లి, ముద్విన్ జెడ్పీహెచ్‌ఎస్, మండల పరిషత్ ఉన్నత పాఠశాల చరికొండను అమ్మ ఆదర్శ పాఠశాల పథకం కింద ఎంపిక చేసింది. వీటిలో వాస్‌దేవ్‌పూర్ ప్రాథమికోన్నత పాఠశాల, గడ్డమీదితండా ప్రాథమిక పాఠశాల, అన్మాస్‌పల్లి ప్రాథమిక పాఠశాలలో అభివృద్ధి పనులు పూర్తికావచ్చాయి. వాటిని ఈనెల 12న ప్రారంభించేందుకు విద్యాశాఖ అధికారులు కృషి చేస్తున్నారు. మిగతా పాఠశాలల్లో పనులు ముమ్మరంగా సాగుతున్నాయి.

ఉపాధ్యాయుల కొరత

మండలంలోని పలు పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత విద్యార్థులకు ఇక్కట్లకు గురిచేస్తోంది. మక్తమాదారం గ్రామంలో ప్రాథమికోన్నత పాఠశాలలో హిందీ పండిట్, వాస్‌దేవ్‌పూర్ ప్రాథమికోన్నత పాఠశాలలో తెలుగు పండిట్, ముద్విన్, రావిచేడ్ ప్రాథమిక పాఠశాలలో హెచ్‌ఎం పోస్టులు, కడ్తాల్ బాలుర ఉన్నత పాఠశాలలో బయోసైన్స్. ఇంగ్లీష్, సోషల్ స్టడీస్ టీచర్లు, కడ్తాల్ బాలికల ఉన్నత పాఠశాలలో సోషల్ స్టడీస్ టీచర్, రావిచేడ్ ఉన్నత పాఠశాలలో తెలుగు, చల్లంపల్లి యూపీఎస్‌లో ఎస్‌జీటీ, కర్కల్‌పహాడ్ యూపీఎస్‌లో ఎస్‌జీటీ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. వెంటనే ఆయా ఖాళీలకు ఉపాధ్యాయులను నియమించాలని కోరుతున్నారు. దీనికితోడు మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలతో పాటు, ప్రాథమిక పాఠశాలకు ప్రహరీలేక పోవడంతో పాటు, మల మూత్ర శాలలు లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. వెంటనే ప్రభుత్వం ప్రహరీల నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని, అదే విధంగా స్కావెంజర్లను నియమించాలని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు కోరుతున్నారు.

త్వరలో పూర్తిచేస్తాం



అమ్మ ఆదర్శ పాఠశాల పథకం కింద మండలంలో 12 పాఠశాలలు ఎంపిక కాగ 3 పాఠశాలల్లో కలరింగ్ పనులు మినహా మిగతా పనులు పూర్తయ్యాయి. మిగతా 9 పాఠశాలల్లో ఈనెల చివరిలోగా పనులు పూర్తి అయ్యే అవకాశం ఉంది. తాగునీరు, మరుగుదొడ్లు, విద్యుద్దీకరణ, మైనర్ రిపేర్స్ పూర్తి చేయాల్సి ఉంది. పాఠ్య పుస్తకాలు, యూనిఫాంలు ఇప్పటికే పాఠశాలలకు చేరుకున్నాయి. మండలంలో పలు పాఠశాలలో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ ఖాళీలలకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. గత సంవత్సరం విద్యార్థులు లేక మూతపడిన పాఠశాలలను తిరిగి ప్రారంభించేందుకు కృషి చేస్తాను.

– జంగయ్య, నోడల్ అధికారి, కడ్తాల్

బీజేపీ నేతల సంబురాలు



అబ్దుల్లాపూర్‌మెట్: వేడుకల్లో పాల్గొన్న బీజేపీ నాయకులు

అబ్దుల్లాపూర్‌మెట్: భారత ప్రధానమంత్రిగా నరేంద్ర మోదీ వరుసగా మూడోసారి ప్రమాణ స్వీకారం చేయడంతో ఆదివారం రాత్రి బీజేపీ నేతలు సంబురాలు జరుపుకున్నారు. అబ్దుల్లాపూర్‌మెట్ మండల కేంద్రంలో ఆ పార్టీ మండల అధ్యక్షుడు విష్ణుగౌడ్, కవాడిపల్లిలో మండల పార్టీ ప్రధాన కార్యదర్శి సురేష్‌గౌడ్ ఆధ్వర్యంలో ఆ పార్టీ నేతలు బాణాసంచా కాల్చి స్వీట్లు పంచిపెట్టారు. మరోసారి బీజేపీ సర్కార్ అన్నమాటకు ప్రజల్లో అనూహ్య స్పందన వచ్చిందన్నారు. దేశంలోని మెజార్టీ ప్రజలు మోదీ, బీజేపీ పై నమ్మకంతో తమకు అధికారం కట్టబెట్టారన్నారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు వీరస్వామి, జంగమయ్య, పాపయ్య, రమాదేవి, సురేఖ, శ్రీలత, యాదగిరి, రామకృష్ణ, సాయి, శ్రావణ్, బీజేవైఎం నాయకులు పాల్గొన్నారు.

తలకొండపల్లిలో..

తలకొండపల్లి: నరేంద్రమోదీ మూడోసారి ప్రధానమంత్రిగా ప్రమాణ స్వీకారం చేయడంతో పాటు బండి సంజయ్, కిషన్‌రెడ్డి కేంద్ర మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేయడంతో మండల కేంద్రంలో బీజేవైఎం అసెంబ్లీ కన్వీనర్ అనిల్ ఆధ్వర్యంలో సోమవారం సంబురాలు చేసుకున్నారు. టపాకులు కాల్చి, బాణసంచా పేల్చారు. గ్రామ ప్రధాన కూడళ్ల మీదుగా ర్యాలీ నిర్వహించారు. జై మోదీ, జై బీజేపీ అంటూ నినాదాలు చేశారు. బీజేపీతోనే అభివృద్ధి సాధ్యమన్నారు. కార్యక్రమంలో బీజేవైఎం, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

ప్రభుత్వ బడుల్లో నాణ్యమైన విద్య

- ఎంఈఓ సర్దార్‌నాయక్
- ముమ్మరంగా బడిబాట

ఆమనగల్లు: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుతుందని ఆమనగల్లు ఎంఈఓ సర్దార్ నాయక్ అన్నారు. ఆమనగల్లు పట్టణంతో పాటు మండలంలోని వివిధ గ్రామాల్లోని ప్రభుత్వ బడుల్లో సోమవారం బడిబాట ర్యాలీలు నిర్వహించారు. పట్టణంలోని గుర్రంగుట్ట, గేటు తండాలో ఎంఈఓ సర్దార్‌నాయక్ పాల్గొని ఇంటింటికి తిరుగుతూ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని వారి తల్లిదండ్రులను కోరారు. ఆయా కార్యక్రమాల్లో ఆమనగల్లు బాలికల ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు మమత, శ్రీలత, కాశీరావ్, సీఆర్‌పీలు కిషన్, షేక్ అహ్మద్, ఉపాధ్యాయులు సంతోష తదితరులు పాల్గొన్నారు.

యాచారం మండలంలో..

యాచారం: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు ఉచితంగా మెరుగైన విద్య అందుతుందని ఎంపీపీ కొప్పు సుకన్య పేర్కొన్నారు. యాచారంలో సోమవారం నిర్వహించిన బడిబాట ర్యాలీలో ఆమె పాల్గొన్నారు. పిల్లలను ప్రభుత్వ పాఠశాలలకే పంపించాలని తల్లితండ్రులను కోరారు. అనంతరం మండల విద్యావనరుల కేంద్రంలో వివిధ పాఠశాలల హెచ్‌ఎంలకు పాఠ్యపుస్తకాలను పంపిణీ చేశారు. మండల విద్యాధికారి వెంకట్‌రెడ్డి, వివిధ పాఠశాలల హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



యాచారం: హెచ్‌ఎంలకు పాఠ్య పుస్తకాలు అందేజేస్తున్న ఎంపీపీ సుకన్య



ఆమనగల్లు: గేటుతండాలో బడిబాట ర్యాలీలో ఎంఈఓ సర్దార్‌నాయక్

ఉద్యోగ భద్రత కల్పించండి

మున్సిపల్ కమిషనర్‌కు బిల్ కలెక్టర్ల వినతి

ఇబ్రహీంపట్నం: చాలీచాలని వేతనాలతో పనిచేస్తున్న తమ జీతాలను పెంచడంతో పాటు ఉద్యోగ భద్రత కల్పించాలని ఆదిబట్ల మున్సిపల్ బిల్ కలెక్టర్స్ మున్సిపల్ కమిషనర్ బాలకృష్ణకు సోమవారం వినతిపత్రం అందించారు. వారు మాట్లాడుతూ.. ఆదిబట్ల మున్సిపాలిటీగా ఆవిర్భవించక ముందు నుంచి గ్రామ పంచాయతీల్లో బిల్ కలెక్టర్లుగా పనిచేస్తున్నాం... మున్సిపాలిటీగా మారిన తర్వాత మా పరిస్థితులు మారుతాయని భావిస్తే అందుకు భిన్నంగా తయారయ్యాయని ఆందోళన వ్యక్తం చేశారు. సుమారు 10 నుంచి 30 సంవత్సరాల సీనియార్టీతో పలువురు పనిచేస్తున్నా ఉద్యోగ భద్రత కొరవడిందని... గత ప్రభుత్వానికి ఎన్నిసార్లు విన్నవించినా పట్టించుకోలేదన్నారు. ఈ కార్యక్రమంలో బిల్‌కలెక్టర్లు పర్వతాలు, రాజశేఖర్, నరేందర్, సురేష్, రవీందర్, మల్లికార్జున్, స్వామి, మల్లారెడ్డి, సదానంద్ పాల్గొన్నారు. స్థానిక ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి దృష్టికి కూడా ఈ విషయాన్ని తీసుకెళ్లినట్లు వారు తెలిపారు.



కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న బిల్ కలెక్టర్లు

అభివృద్ధి పనులపై దృష్టి పెట్టండి

ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి

ఇబ్రహీంపట్నం: అధికారులు అభివృద్ధి పనులపై దృష్టి సారించాలని ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అన్నారు. నగరంలోని తిరుమలహిల్స్‌లోని ఆయన నివాసంలో సోమవారం నియోజకవర్గంలోని నాలుగు మండలాల అభివృద్ధి పనులపై సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మల్‌రెడ్డి మాట్లాడుతూ.. లోక్‌సభ ఎన్నికల కోడ్ తొలగిపోవడంతో నియోజకవర్గంలో నిలిచిపోయిన, చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలన్నారు. నిధుల సమస్యలుంటే తన దృష్టికి తీసుకురావాలన్నారు.అన్నివిధాల తన సహాయ సహకారాలుంటాయ తెలిపారు.

న్యాయం చేయండి సారూ..

యాచారం: కబ్జాలో ఉన్న పట్టా భూమికి సర్టిఫికెట్లు ఇప్పించాలని మంతన్‌గౌరెల్లికి చెందిన బిక్కునాయక్ ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డికి విజ్ఞప్తి చేశారు. గతంలో బిక్కునాయక్.. ఇతరులు తనభూమి మీదకు వచ్చి ఇబ్బందులు పెడుతున్నారని యాచారం పీఎస్ ఎదుట ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో సోమవారం కుటుంబ సభ్యులతో కలిసి ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డిని కలిసిన బిక్కునాయక్ మాట్లాడతూ.. ఏళ్లుగా పట్టా భూమిలో కబ్జాలో ఉన్నాం, పట్టా కోసం ధరణి పోర్టల్‌లో అర్జీ పెట్టుకున్నాం.. అయినా పట్టా సర్టిఫికెట్లు రావడం లేదని వాపోయారు. గ్రామస్తులు కొందరు ఆ భూమి తమదేనని కబ్జాలోకి వస్తున్నారని.. మీరే న్యాయం చేయాలి... లేదంటే ఇక్కడే చనిపోతానని ఎమ్మెల్యే ముందు వాపోయారు. స్పందించిన ఎమ్మెల్యే రెవెన్యూ అధికారులతో మాట్లాడి సర్వే చేయించి న్యాయం చేస్తానని హామీ ఇచ్చారు.



ఇబ్రహీంపట్నం: మాట్లాడుతున్న ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి

అందుబాటులో పాఠ్యపుస్తకాలు

కందుకూరు: ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు పాఠ్యపుస్తకాలను పంపిణీ అధికారులు చేపట్టారు. మండల పరిధిలో 11 జిల్లా పరిషత్ పాఠశాలలు, 12 ప్రాథమికోన్నత పాఠశాలలు, 30 ప్రాథమిక పాఠశాలలు ఉన్నాయి. వీటిలో ఒకటో తరగతి నుంచి పదో తరగతి వరకు 4728 మంది విద్యార్థులు చదువుతున్నారు. ఈ నెల 12న పాఠశాలలు పునఃప్రారంభం కానుండటంతో ప్రభుత్వం తరగతుల వారీగా సబ్జెక్టు, నోట్ పుస్తకాలను సరఫరా చేపట్టింది. మొదటి విడతలో దాదాపుగా 40 శాతం వరకు పుస్తకాలను ఆయా పాఠశాలలకు అధికారులు తరలించారు. నోట్ పుస్తకాలు పూర్తిస్థాయిలో పంపిణీ కాగా, కొన్ని తరగతులకు సబ్జెక్టు పుస్తకాలు అందాల్సి ఉంది. అందులో 7వ తరగతి ఫిజిక్స్, 10వ తరగతి హిందీ, సోషల్, రెండు, నాలుగు తరగతులకు సంబంధించి తెలుగు వాచకాలు ఇవ్వాల్సి ఉంది. మిగతా పుస్తకాలు త్వరలోనే రానున్నట్లు సంబంధిత అధికారులు తెలిపారు. అలాగే, యూనిఫాంలు కూడా సిద్ధమవుతున్నాయి.

ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం



వేడుకల్లో పాల్గొన్న ఇబ్రహీంపట్నం ప్రభుత్వ ఉన్నత పాఠశాల 1983-84 బ్యాచ్ విద్యార్థులు

ఇబ్రహీంపట్నం: ఇబ్రహీంపట్నం ప్రభుత్వ ఉన్నత పాఠశాల 1983–84 పదో తరగతి బ్యాచ్ విద్యార్థులు 40 వసంతాలు పూర్తిచేసుకున్న సందర్భంగా ఆదిబట్ల మున్సిపల్ పరిధిలో గల ఓ ఫాంహౌస్‌లో 'రూబీ' పేరుతో పూర్వ విద్యార్థుల సమ్మేళన నిర్వహించుకున్నారు. దాదాపు 70 మంది పూర్వ విద్యార్థులు ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకొని యోగక్షేమాలు తెలుసుకున్నారు. కేక్ కట్‌చేసి, కుర్రకారును తలపించే విధంగా మైక్‌సౌండ్ రికార్డుల మధ్య ఆటపాటలతో మైమరిచిపోయారు. సామూహిక భోజనాలు చేశారు. అనిల్‌కుమార్ అనే పూర్వ విద్యార్థి లండన్ నుంచి ప్రత్యేకంగా ఈ రూబీ వేడుకల్లో పాల్గొనేందుకు రావడం కొసమెరుపు. మరణించిన తోటి పూర్వ విద్యార్థుల ఆత్మశాంతికై మౌనం పాటించి అంజలి ఘటించారు. కార్యక్రమాన్ని సక్సెస్ చేసిన పలువురిని సత్కరించారు.

నీట్ ర్యాంకర్ ప్రనూషకు సన్మానం

ఆమనగల్లు: ఆల్ ఇండియా నీట్ ఫలితాల్లో 640 మార్కులు సాధించిన ఆమనగల్లు మండలం ఆకుతోటపల్లికి చెందిన సీత ప్రనూషను బడంగ్‌పేట్ నగర కార్పొరేషన్ కార్పొరేటర్ సూర్లగంటి అర్జున్ ఘనంగా సత్కరించారు. ఆకుతోటపల్లి గ్రామానికి చెందిన సీత ప్రనూష తల్లిదండ్రులు సీత సంతోష, కృష్ణ ప్రస్తుతం బడంగ్‌పేట్‌లోని శ్రీ నిలయ టౌన్‌షిప్‌లో నివాసం ఉంటున్నారు. శ్రీనిలయం టౌన్‌షిప్‌లో సోమవారం జరిగిన కార్యక్రమంలో సీత ప్రనూషను కార్పొరేటర్ ఘనంగా సత్కరించారు. భవిష్యత్‌లో మరింత ఉన్నత చదువులు చదవాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కాలనీ వాసులు వెంకటేశ్, గోపాల్‌రెడ్డి, బాలకృష్ణ, యాదయ్య, దయాకర్, కృష్ణమూర్తి, తిరుపతయ్య, విఠల్, జైపాల్‌రెడ్డి, వెంకటేశం, శ్రీనివాస్ రాథోడ్ తదితరులు పాల్గొన్నారు.



సీత ప్రనూషను సత్కరిస్తున్న కార్పొరేటర్ అర్జున్

విద్యార్థులకు అన్నదానం, పండ్ల పంపిణీ

వనస్థలిపురం: కర్పూరి ఠాకూర్ సామాజిక సేవా సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు, బీసీ కులాల ఐక్య వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షుడు అశ్విని ఆంజనేయులు తన జన్మదినాన్ని పురస్కరించుకుని వనస్థలిపురంలోని శాంతినికేతన్ దివ్యాంగుల పాఠశాలలో విద్యార్థులకు అన్నదానం, పండ్లు పంపిణీ చేశారు. దివ్యాంగుల పాఠశాల నిర్వాహకులు బాలేశ్వర్, బీసీ కులాల ఐక్య వేదిక రాష్ట్ర శాఖ అధ్యక్షుడు పాండు యాదవ్, నాగరాజు, విజయ్‌కుమార్, నర్సింహులు, దేవేందర్, అరుణ్‌కుమార్ పాల్గొన్నారు.

మహిళాభ్యున్నతి దిశగా అడుగులు

- మహిళా సంఘాల సభ్యులతో స్కూల్ యూనిఫాంలు కుట్టిస్తోన్న ప్రభుత్వం
- ఒక్కో యూనిఫాంకు రూ.75 చెల్లింపు
- మండలంలో నాలుగు కేంద్రాలు



తలకొండపల్లిలోని ఓ కుట్టు కేంద్రంలో కుట్టిన యూనిఫాంలను చూపిస్తున్న అధికారులు

తలకొండపల్లి: పొదుపు మహిళా సంఘాల సభ్యులు ఆర్థికంగా ఎదుగాలనే లక్ష్యంతో ప్రభుత్వం విద్యార్థుల స్కూల్ యూనిఫాంలను వారితో కుట్టిస్తోంది. జూన్ 12న ప్రభుత్వ పాఠశాలలు పునఃప్రారంభం కానున్న నేపథ్యంలో యూనిఫాంల కుట్టు పని ముమ్మరంగా కొనసాగుతోంది. ప్రభుత్వం ద్వారా విద్యార్థుల యూనిఫాంలను కుడుతూ ఆర్థికంగా లబ్ధి పొందుతున్నారు. విద్యార్థులకు స్కూల్ యూనిఫాంలను సకాలంలో అందిస్తామని మహిళా సమాఖ్య అధికారి (ఏపీఎం) శ్రీదేవి తెలిపారు. మండల మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో మండల కేంద్రంతో పాటు, చుక్కాపూర్ ఖానాపూర్, వెల్జాల్, తదితర గ్రామాల్లో 4 మహిళా శక్తి కుట్టు కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఆయా గ్రామాల్లో మహిళా సంఘాల్లో ఉన్న సభ్యులు కుట్టుమిషన్ నేర్చుకున్న వారు విద్యార్థుల దుస్తులను కుట్టేందుకు ఎంపిక చేశారు. మండలంలో 32 గ్రామ పంచాయతీల్లో 52 పాఠశాలల్లో చదువుతున్న 2,639 మంది విద్యార్థులకు, ఒక్కో విద్యార్థికి ఒక జత చొప్పున 2,639 యూనిఫాంలను కుడుతున్నారు. ఇప్పటివరకు 80 శాతం వర్క్ పూర్తయ్యింది. ఇప్పటి వరకు 2,000 యూనిఫాంలను కుట్టి మండలంలోని ఆయా పాఠశాలలకు అందజేశారు. మిగతా యూనిఫాంలను ఈనెల 12వ తేదీ లోగా అందించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఈ 4 కేంద్రాల్లో 60 మంది మహిళలు కుట్టుపనిలో నిమగ్నమై రోజుకు 15వరకు యూనిఫాంలను కుడుతున్నారు. నిత్యం ఇదే పనిలో వారు నిమగ్నమయ్యారు. ఒక్కో యూనిఫాంకు రూ.75 చొప్పున ప్రభుత్వం చెల్లిస్తోంది. ఈ విధంగా ప్రభుత్వం మహిళాభ్యున్నతే లక్ష్యంగా అడుగులు ముందుకు వేస్తోంది. మహిళలు ఆర్థికంగా ఎదిగి తమ కుటుంబానికి చేదోడుగా నిలిచేందుకు ఒక అవకాశం కల్పించినట్లవుతోంది.

గడువులోగా పూర్తిచేస్తాం



మండలంలో 4 కుట్టు కేంద్రాలను ఏర్పాటు చేశాం. 52 పాఠశాల్లో చదవుతున్న 2,639 విద్యార్థులకు గాను ప్రతి విద్యార్థికి ఒక్కో జత చొప్పున 2,639 యూనిఫాంలను కుట్టడానికి తగు చర్యలు తీసుకున్నాం.ఇప్పటి వరకు 2000 యూనిఫాంలను కుట్టి ఆయా పాఠశాలలకు అందించాం. యుద్ధ ప్రాతిపదికన పనులు జరిపి మిగతా యూనిఫాంలను గడువులోపు అందిస్తాం.

– శ్రీదేవి, ఏపీఎం, తలకొండపల్లి